క్లుప్తంగా

పూడికతీత పనులు



జేసీబీ సహాయంతో పూడికల తొలగింపు

విజయనగరం: ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ప్రజారోగ్య సిబ్బంది ఆదివారం తొలగించారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ఉన్న ప్రధాన కాలువలో జేసీబీ సహాయంతో పూడికతీత పనులు చేపట్టారు. కాలువలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తాచెదారాలను జేసీబీతో తొలగించి, టిప్పర్ ద్వారా తరలించారు.

అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ



హర్షితను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పూసపాటిరేగ: విజయవాడ విశ్వంటెక్‌లో ఈనెల 9న రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీలలో ఓక్‌ల్యాండ్ విద్యార్థి విజేతగా నిలిచింది. పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి కొల్లి హర్షిత రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో మూడో స్థానంలో నిలిచింది. జనవరి 5న జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో హర్షిత విజేతగా నిలవడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విషయం తెలసిందే. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజేతగా నిలవడంతో విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ రవి, కరస్పాండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, డైరెక్టర్ శివన్నారాయణ, తదితరులు ఆదివారం అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుర్ల మండలం గోషాడ గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి పది సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎం. వెంకటరావు హెచ్చరించారు.

బొప్పడాంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం జంక్షన్‌లో గడిచిన రెండు రోజుల నుంచి బెల్ట్ దుకాణాల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. పక్కనే కమ్మసిగడాంలోని మహాలక్ష్మి అమ్మవారి జాతర జరుగుతున్న సందర్భంగా బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయని స్థానికులు చెబుతున్నారు. బొప్పడాం ఉన్నత పాఠశాల సమీపంలోని రెండు దుకాణాల్లో.. బుచ్చన్నపేట జంక్షన్ సమీపంలోని మరో రెండు దుకాణాల్లో పగలురాత్రీ అనే తేడా లేకుండా విక్రయాలు జరుగుతున్నాని పలువురు ఆరోపిస్తున్నారు. సతివాడ మద్యం షాపు నుంచి మద్యం సీసాలు తీసుకువచ్చి, ఒక్కో సీసాపై రూ. 50 అదనంగా వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ దుకాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రశ్నపత్రాలను ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ రానున్న పబ్లిక్ పరీక్ష కోసం ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరీక్ష రాయడం వల్ల పబ్లిక్ పరీక్షలంటే ఉన్న భయం పోతుందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ.. మోడల్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము, సహాయ కార్యదర్శి రవి, జిల్లా నాయకులు రాజు, సూరిబాబు, సమీరా, జయ ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గొర్లిపేట సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంతలు

కళ్లకు గంతలు తీసి..

గుంతలు కప్పండి..!

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. శ్రీకాకుళం, విజయనగరం రెండు జిల్లాలను కలిపే రహదారి కావడంతో తమ గమ్యస్థానాలను చేరుకునేందుకు ఈ రహదారినే ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతి పెద్ద పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం కూడా ఈ రహదారిలోనే ఉంది. గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణ పనులు చురుకుగా జరగగా.. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వంలో విస్తరణ పనులకు బ్రేకులు పడ్డాయి. దీంతో పనులు ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. రామతీర్థం జంక్షన్ నుంచి ఎంబేరేయగుళ్ల జంక్షన్ వరకు ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గొర్లిపేట, రామతీర్థం, డి. నెలివాడ వద్ద ఏర్పడిన గోతుల్లో నీరు చేరడంతో ప్రయాణికులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళ్లు తెరిచి కనీసం గుంతలైనా కప్పాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



రామతీర్థం రహదారి మధ్యలో ఏర్పడిన గుంతల్లో చేరిన నీరు

• పేదలకు చేయూత..



పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘ అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో పేదలకు బియ్యం, గోధుమ నూక వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు సేవచేస్తే భగవంతుడికి సేవ చేసినట్లేనని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.– విజయనగరం ఫోర్ట్

• కథలు సమాజానికి దారి దీపాలు..



కథల్లోని వస్తువు సమాజంలోకి పాఠకుల ద్వారా చొచ్చుకునిపోయి, సమాజానికి దారి దీపమవుతుందని రాజాం రచయిత వేదిక అధ్యక్షుడు గార రంగనాథం అన్నారు. కథాలోగిలి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక గురజాడ గ్రంథాలయంలో నిర్వహించారు. ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్తి రామ్మోహనరావు పుస్తక పరిచయం చేశారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి, సహజ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎన్‌కే బాబు, రాజాం, పార్వతీపురం, విజయనగరం ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

చెత్త ప్రక్షాళనకు చర్యలు



సర్వే చేపడుతున్న సిబ్బంది

• నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: గుణుపూరుపేట డంపింగ్ యార్డ్‌లో చెత్తను శతశాతం ప్రక్షాళన చేసే దిశగా ప్రయత్నిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గుణుపూరుపేటలో ఉన్న చెత్త వివరాలను సేకరించేందుకు ఆదివారం డ్రోన్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాస్తవానికి నగరం నుంచి చేరుతున్న చెత్తను ఎప్పటికప్పుడు 95 శాతం వరకు మధురవాడలో ఉన్న గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన ఐదు శాతం మట్టి, కొమ్మలు మాత్రమే గుణుపూరుపేటలో మిగిలిపోయాయని తెలిపారు. అయితే కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్త ఎంత ఉన్నదీ అన్న విషయమై అధ్యయనం చేసే నిమిత్తం డ్రోన్ సర్వే చేపడుతున్నామన్నారు. 2022 నుంచి గుణుపూరుపేటలో ఉన్న చెత్తను ప్రతిరోజూ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మిగిలి ఉన్న చెత్తను కూడా సంపూర్ణంగా ప్రక్షాళన చేసే దిశగా డ్రోన్ సర్వే చేపడుతున్నామన్నారు.

వివక్ష కనబరిస్తే సహించం..

• వైఎస్సార్‌సీపీ నాయకులు

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వివక్ష కనబరిస్తే సహించేది లేదని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి. రామకృష్ణ, ఎస్సై ఐ.దుర్గాప్రసాద్‌లను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు కేసులలో పోలీసులు పక్షపాత వైఖరి చూపించి అధికార పార్టీ నాయకుల పట్ల మొగ్గు చూపారన్నారు. పేరాపురంనకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోరాడ మహేష్‌పై జనసేన నాయకుడు దాడి చేస్తే, ఇరువైపులా కేసులు నమోదు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పతివాడ బర్రిపేట కేసులో కొబ్బరి మొక్కలు ధ్వంసం చేసిన కేసులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బర్రి నర్సయ్యమ్మ , పోలిరాజులపై కూడా ఇదే మాదిరిగా కేసు నమోదు చేశారన్నారు. కొన్నేళ్లుగా కుటుంబ తగాదాలు ఉండడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పడంతో వైఎస్సార్‌సీపీ ఖండించారు. ఎరుకొండలో జరిగిన వివాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్ల పోలీసులు వివక్ష కనబరిచారని సీఐ దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవాలు పరిశీలించి తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప.. ఏకపక్షంగా కేసులు నమోదు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్ , ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, మహంతి శ్రీనివాసరావు, మొంగం నాగబాబు, దాడిశెట్టి త్రినాథరావు, రౌతు సాయికుమార్, ఎడ్ల రామకృష్ణ, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కొయ్య ఎల్లన్నరెడ్డి, టొంపల సీతారాం, వాసుపల్లి అప్పన్న, కొత్తకోట శ్రీరాములు, శాంతాటి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



పోలీసు అధికారులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వీలుపర్తిలో పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు (ఫైల్)

కట్టె జనుముతో భూసారం / ఆదాయం బాగు

- విస్తరిస్తున్న కట్టెజనుము సాగు
- రబీలో విత్తనోత్పత్తి చేసి వాటిని విక్రయిస్తూ ఆదాయం ఆర్జిస్తున్న రైతులు
- ఖరీఫ్‌లో భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువుగా వినియోగం

వేపాడ: కట్టె జనుము పంట రైతులకు అన్ని విధాలా లాభసాటిగా మారుతోంది. ఒకప్పుడు ఈ పంటను పచ్చిరొట్ట ఎరువు కోసమే సాగు చేసేవారు. కానీ ప్రస్తుతం వాణిజ్య పంటగా మారడంతో ఎస్.కోట నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. కట్టె జనుమును సాగు చేసి కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని, ఫలితంగా ప్రధాన పంటలకు పోషకాలు బాగా అందుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే కేవలం పచ్చిరొట్ట ఎరువు కోసమే ఈపంటను సాగుచేయడం ఎందుకని చాలామంది రైతులు రబీలో అపరాల పంటలను సాగు చేస్తున్నారు. కానీ కట్టెజనుముతో కలిగే ప్రయోజనాలు, వచ్చే ఆదాయం గురించి తెలిసిన కొందరు రైతులు మాత్రం అపరాల సాగుకు ప్రత్యామ్నాయంగా కట్టె జనుమును ఎంపిక చేసుకుంటున్నారు. అపరాల సాగు పెట్టుబడితో కూడిన పని, వాతావరణ పరిస్థితులు కూడా అను కూలించాలి. పంటను ఏమైనా చీడపీడలు ఆశిస్తే సరైన దిగుబడు లు రాక రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. కట్టె జనుము సాగులో ఆ ఇబ్బందులు ఉండవు. ఈపంటసాగుకు దుక్కులు, విత్తనాల ఖర్చు తప్ప కలుపు తీత, ఎరువులు, పురుగుమందుల ఖర్చు లు ఏమీ ఉండవు. పైగా పంటకు తెగుళ్ల సోకే అవకాశమే ఉండదు. కట్టెజనుము చేను ఓవైపు పచ్చి రొట్ట ఎరువుగా భూసారానికి వినియోగపడుతుండడంతో పాటు మరోవైపు వాటి గింజలు విత్తనోత్పత్తికి, ఆయుర్వేద వైద్యంలో ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా ఈ పంటసాగుపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం ఎస్. కోట నియోజకవర్గంలోని వేపాడ మండలంలో 155 ఎకరాల్లో, ఎల్.కోట, కొత్తవలస, ఎస్.కోట మండలాల్లో 84 ఎకరాల్లో బోరుబావులు ఆధా రంగా కట్టెజనుమును సాగుచేస్తున్నారు.ప్రస్తుతం పంట పూత, కాయలు కాత దశకు రావడంతో పసుపు పచ్చని పూలతో పొలాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.



వేపాడలో సాగులో ఉన్న కట్టె జనుము

భూమికి సారం... రైతుకు సిరులు

ఎలాంటి పెట్టుబడి ఖర్చులు లేని కట్టె జనుము సాగుతో రైతులకు రెండు విధాలుగా లాభాలున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగయ్యే పంట అని, భూసారం పెంచడానికి, ఆదాయ ఆర్జనకు ఉపయోగపడుతుందని అంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తూ పంటలను సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం తగ్గి, చౌడుశాతం పెరిగి క్రమంగా నేలలు నిస్సారమై సాగుకు పనికి రాకుండా పోతాయి. ఎంతపెట్టుబడి పెట్టినా దిగుబడి రాకరైతులు నష్టపోతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట పంటల్లో ఒకటైన కట్టెజనుమును సాగు చేసి నేలలో కలియదున్నడం వల్ల భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు అందుతాయి, ఫలితంగా భూసారం పెరుగుతుంది. కట్టె జనుము గింజలను విత్తనాలుగా విక్రయించుకోవచ్చు. అలాగే ఈ గింజలను ఆయుర్వేద వైద్యంలో మోకాళ్ల నొప్పుల నివారణకు వినియోగించే హెంప్ ఆయిల్ తయారీకి ఉపయోగిస్తున్నారు. ఎకరానికి సుమారు అయిదు క్వింటాళ్ల గింజలు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని, మార్కెట్‌లో వీటి ధర కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని పలువురు రైతులు చెబుతున్నారు.

సాగు విస్తీర్ణం పెరిగింది

జిల్లాలో వేపాడ మండలాన్ని ప్రకృతి వ్యవసాయానికి మోడల్‌గా ఎంపికచేశాం.కట్టె జనుము సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. ఈ పంట పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుతుంది. రబీలో సాగు చేస్తున్న జనుము నుంచి విత్తనోత్పత్తి చేసి వాటిని రైతులు మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఖరీఫ్‌లో సాగు చేసే జనుము పంటను భూసారం కోసం నేలలో కలియదున్నుతుంటారు.

– ఎం.ఆనందరావు, ప్రకృతి వ్యవసాయ విజయనగరం జిల్లా ప్రాజెక్టు అధికారి

జాతర ఏర్పాట్ల పరిశీలన

డెంకాడ: ఈ నెల పదో తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న జొన్నాడ పైడితల్లి అమ్మవారి జాతర ఏర్పాట్లను భోగాపురం సీఐ రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. అమ్మవారి ఆలయానికి ఆనుకుని విజయనగరం–విశాఖ జాతీయ రహదారి ఉంది. దీంతో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. జాతరలో శాంతిభద్రదల సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో పైడితల్లి అమ్మవారి జాతర జరిగే విధంగా గ్రామస్తులు, భక్తులు సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాలు విక్రయించినా, సేవించినా చట్ట ప్రకారం చేర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎ.సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



జొన్నాడలో పైడితల్లి పండగ ఏర్పాట్లు పరిశీలిస్తున్న భోగాపురం సీఐ రామకృష్ణ, తదితరులు

ప్రజ్ఞావికాస్ పరీక్షకు విశేష స్పందన



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకుడు వెంకటరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు

శృంగవరపుకోట: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎస్.కోట మండల కమిటీ నేతృత్వంలో స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞావికాస్ పరీక్షకు విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. పరీక్షకు వివిధ పాఠశాలలకు చెందిన 290 మంది విద్యా ర్థిని, విద్యార్థులు హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.వెంకటరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ సుదీర్ఘ పోరాటం చేయడమే కాకుండా, విద్యార్థులను ప్రోత్స హించేలా పోటీ పరీక్షలు నిర్వహిస్తూ, బహు మతులు ఇచ్చి వారిలో ప్రేరణ కలిగించడం అభినందనీయమన్నారు. పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడుతు న్నందున విద్యార్థులంతా సమయం వృథా చేయ కుండా శ్రద్ధగా చదువుకుంటూ సన్నద్ధం కావాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఏ.అనూష, మండల బాలికల కమిటీ కన్వీ నర్ రత్న, జిల్లా ఉపాధ్యక్షుడు కె.రమేష్, మండల కమిటీ సభ్యులు వి.చరణ్, రవి,శీల, అనిల్, తదితరులు పాల్గొన్నారు.